## క్లుప్తంగా

### వైభవంగా రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకారంలో రాధాకృష్ణులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో శ్రీజగన్నాథ మందిరంపై ఆదివారం శ్రీరాధాష్టమి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరాధా మాధవులకు మహాశంఖాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం మందిరం అధ్యక్షుడు నవదీప్ నరసింహ దాస్ స్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ జరుపుకున్న 15 రోజుల తర్వాత రాధాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ భక్తి గీతాలను ఆలపించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. నూతన పట్టువస్త్రాలు, పిండివంటలు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దారును సత్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల తహసీల్దారుగా విధులు నిర్వహించిన మల్లికార్జునరావు ఆదివారం పదవి విరమణ పొందారు. ఆయనను రెవెన్యూ సిబ్బందితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువ, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు.

### అహోబిలం వాసికి ఉత్తమ అవార్డు



కోమల్ వైకుంఠన్

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అహోబిలానికి చెందిన కోమల్ వైకుంఠన్ 2025 సాత్ ఐకాన్ మహిళా పారిశ్రామికవేత్త అవార్డు అందుకున్నారు. అహోబిలం క్షేత్ర పరిధిలోని నవనారసింహ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆమె అహోబిల మాలోలన్ టూర్స్ అండ్ రిలీజియన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించింది. దీంతో దేశ విదేశాల నుంచే వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తూ రాణిస్తున్నారు. ఈ సేవలకు గాను కోమల్ వైకుంఠన్‌కు జాతీయ ఉత్తమ అవార్డు దక్కింది. ఆదివారం చైన్నై నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు.

### రేకుల షెడ్ దగ్ధం

ఉయ్యాలవాడ : మండలంలోని పడిగెపాడు గ్రామంలో దూదేకుల పుల్లమ్మకు చెందిన రేకుల షెడ్ అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పుల్లమ్మ గొర్రెలు పెంచుకుంటూ జీవిస్తుంది. దోమల నుంచి వాటికి రక్షణ కోసం షెడ్‌లో పొగ పెట్టింది. ప్రమాదవశాత్తు మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. ఈ ఘటనలో షెడ్ కాలిపోవడంతో పాటు రెండు గొర్రెలు మృతి చెందాయి. బాధితురాలు అందించిన సమాచారంతో పశు వైద్యాధికారి రాఘవపుల్లయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

### నలుగురిపై కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లెకు చెందిన పెద్దయ్య, శివ, సురేష్, అంకాలమ్మ అనే నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫి ఆదివారం తెలిపారు. ఇంటి గోడ విషయంలో తలెత్తిన గొడవలో పై నిందితులు తమపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు నాగలచ్చమ్మ, ఆమె భర్త నరసింహులు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

### దాడి చేసిన నలుగురిపై కేసు

కొలిమిగుండ్ల: మదనంతపురానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంధ్య గణేష్‌తో పాత కక్షలు పెట్టుకున్న అదే గ్రామానికి చెందిన నాగరి రమేష్, రాకేష్, శ్రీనాథ్, చిన్న కంబగిరి రాముడు అతనిపై దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్ తలకు గాయాలైనట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



నంద్యాలలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న భక్తురాలు రేణుక



రంగులు చల్లుకుంటూ..



స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

# భక్తా..వెళ్లొస్తా!

## కనుల పండువగా గణేష్ నిమజ్జనోత్సవం

- నంద్యాలలో మిన్నంటిన గణపతి బప్పా మోరియా నినాదాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- కిటకిటలాడిన పురవీధులు
- చిన్న చెరువులో 6 క్రేన్‌లతో నిమజ్జనం
- అర్ధరాత్రి దాటే వరకు సాగిన కార్యక్రమం



నంద్యాల చిన్న చెరువు వద్ద వినాయకుడి నిమజ్జనం దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గణేష్ నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వాడవాడల కొలువుదీరిన గణనాథులు ఐదురోజులు పూజలందుకొని ఆదివారం గంగమ్మ ఒడికి చేరారు. ఉత్సవంలో భాగంగా విగ్నేశ్వర ప్రతిమలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు , హోమాలు, అర్చనలు, సామూహిక అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో నిమజ్జనానికి తరలించారు. నంద్యాల పట్టణంలో ఈ కార్యక్రమం కనుల పండువగా సాగింది. శోభాయాత్రంలో చిన్నారులు, మహిళలు, పెద్దలు అందరు ఒకరిపై ఒకరు వసంతం చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. జై బోలో గణేష్ మహరాజ్‌కి,గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య గణపయ్యాలు చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఘాట్‌కు చేరుకున్నారు.

**సంప్రదాయబద్ధంగా పూజలు**

నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వినాయక ఘాట్ వద్ద మొదట గంగాదేవికి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, డీఆర్‌ఓ రాముస్వాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఆర్‌డీఓ విశ్వనాథ్, కమిషనర్ బండి శేషన్న, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ తదితరులు హాజరై నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. మొదట కలెక్టరేట్ పరిపాలన వినాయకుడు, నంద్యాల ఎస్పీ కార్యాలయంలో కొలువైన మట్టి గణపతికి వీడ్కోలు పలికారు. సాయంత్రం నుంచి ఘాట్‌లో విగ్రహాల నిమజ్జనం ఊపందుకుంది. నంద్యాల పట్టణంలో 800కు పైగా విగ్రహాలు నెలకొల్పారు. ఈ విగ్రహాలు కల్పనా సెంటర్‌కు చేరుకోవడంతో శోభాయాత్ర బైర్మల్‌వీధి, రీడింగ్ రూం జంక్షన్, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కు రోడ్డు మీదుగా వినాయక ఘాట్ వరకు సాగింది. అక్కడ ఆరుక్రేన్‌ల సాయంతో విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ కార్యక్రమం ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు కొనసాగింది.

**లడ్డూవేలం పాట...**

వేలంలో గణనాథుడి లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. నూనెపల్లెలోని శ్రీనివర్తిపురం వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను దింత్యాల రేణుక అనే మహిళ రూ. 2లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. అదే మండపంలో కలశం రూ.45 వేలు, మినప సున్నుండ రూ.55 వేలు పలికింది. హౌసింగ్ బోర్డులోని వినాయక మండపం వద్ద నిర్వహించిన వేలం పాటలో రూ.1,01,001కు పల్లె కృష్ణారెడ్డి పాట పాడి లడ్డూను సొంతం చేసుకున్నారు.

**స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ..**

గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని పట్టణంలో గాంధీచౌక్, కాళికాంబగుడి, కల్పనాసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసనగర్, వినాయక ఘాట్‌ల వద్ద నవనంది రోటరీ క్లబ్, లయన్స్‌క్లబ్, భవనాశి జ్యువెలర్స్, ఖాళీమాత సేవా సమితి, పట్టణ జనరల్ మర్చెంట్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం పలువురు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రసాదాలు, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

**భారీ బందోబస్తు...**

గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని పురవీధులతో పాటు ఘాట్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, అడిషనల్ ఎస్పీ యుగంధర్ రెడ్డి, ఏఎస్పీ మందజావళి ఆల్ఫోన్స్ బందోబోస్తును పర్యవేక్షించారు.



గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



చాపిరేవులలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

**చాపిరేవులలో..**

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని చాపిరేవుల గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జనోత్సవంలో కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. ఊరిలో 5 చోట్ల ఏర్పాటు చేసిన గణనాథులను ఆదివారం గంగమ్మ ఒడికి చేర్చారు.

## గణపతి బప్పా మోరియా

ఆళ్లగడ్డ: పట్టణంలో ఆదివారం వినాయక నిమజ్జనం పండుగలా సాగింది. గణనాథులను ఊరేగింపుగా నాలుగు రోడ్ల కూడలికి చేర్చి అక్కడి నుంచి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జన ర్యాలీ ప్రారంభించారు. యువకులు, మహిళలు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేశారు. పలువురు పౌరాణిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. అడుగడుగునా కేరింతలు కొడుతూ పట్టణ శివారులోని వక్కిలేరు వాగు వరకు తరలివెళ్లి అక్కడ పట్టణ పరిధిలో కొలువైన 156 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమం అర్ధరాత్రి వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ప్రమోద్ పర్యవేక్షణలో సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు

చాగలమర్రి: మండలంలో ఐదురోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ఆదివారం వీడ్కోలు పలికారు. చాగలమర్రిలో ర్యాలీగా తీసుకెళ్లి సమీపంలోని కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. చిన్న వంగలి గ్రామంలోని రెండు మంటపాల్లో లడ్డూకు వేలం పాట నిర్వహించగా ఒకటి రూ.1.80 లక్షలు, మరొకటి రూ.1.10 లక్షలు పలికింది. నిమజ్జనోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ఎంపీటీసీ వై.వెంకటలక్ష్మి, వాసవి యువజన సంఘం అధ్యక్షుడు తోమ్మంద్రు. వినోద్‌కుమార్, ఆర్యవైశ్య సభ ధర్మకర్త వి.లక్ష్మణబాబు, సభ్యులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు



చాగలమర్రిలో భక్తజన కోలాహలం,



ఇడమడక సమీపంలోని కేసీ కాలువలో గణపతిని నిమజ్జన దృశ్యం

## అధ్యాపకుడికి తెలుగు తేజం పురస్కారం



తెలుగుతేజం పురస్కారం అందుకున్న రఫీ

నంద్యాల(న్యూటౌన్): వివిధ సాహితీ స్వచ్ఛంద సంస్థల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ తెలుగు భాష వైభవానికి కృషి చేస్తున్న అధ్యాపకులు ఎంఎండీ రఫీకి తెలుగు తేజం పురస్కారం దక్కిందని సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ రవీంద్ర నాథ్, సమ్మద్, శ్రీనివాసమూర్తి తెలిపారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన తెలుగు భాష దినోత్సవ కార్యక్రమంలో తెలుగు కలలు, సాహిత్యంలో విశిష్ట సేవలు అందిస్తున్న సాహితీ వేత్తలను తెలుగు తేజం పురస్కారాలతో సత్కరించినట్లు తెలిపారు. నంద్యాల పట్టణంలోని కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న రఫీ దశాబ్ద కాలంగా వివిధ పత్రికలకు వ్యాసాలు, కవితలు రాస్తూ రచయితగా గుర్తింపు పొందారన్నారు. కాగా పురస్కారం అందుకున్న రఫీని నంద్యాలకు చెందిన తెలుగు సాహితీ వేత్తలు హయగ్రీవాచార్యులు, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ ఉదయ్‌శంకర్, ముర్తుజా, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

### 3న యాగంటిలో బహిరంగ వేలాలు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పలు వ్యాపార కార్యకలాపాలకు ఈ నెల 3న బహిరంగ వేలాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. వేలాల్లో టెంకాయలు అమ్ముకునే హక్కు, పండ్లు మరియు బొమ్మలు అమ్ముకునే హక్కు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, సామాన్లు భద్రపరచుకునే హక్కులను కేటాయించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు తగిన డిపాజిట్ చెల్లించి వేలాల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

## డోన్‌లో పెరుగుతున్న డామినేషన్ కల్చర్

- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న స్థానిక వ్యాపారులు



గెలాక్సీ చికెన్ సెంటర్‌లో వాదనకు దిగిన వ్యాపారులు



కేరళ షోరూంలో వాదనకు దిగిన స్థానిక గార్మెంట్ వ్యాపారులు

డోన్: ఇటీవల కాలంలో నియోజకవర్గ కేంద్రమైన డోన్‌లో స్థానికేతర వ్యాపారులను బెదిరించే విష సంస్కృతి పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో పట్టణంలో చోటుచేసుకున్న అభివృద్ధి కారణంగా ఇతర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల వ్యాపారులు కూడా డోన్‌లో కొత్త వ్యాపారాలను ప్రారంభించారు. అయితే, ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని కొందరు కూటమి పార్టీల అండదండలున్న వ్యక్తులు స్థానికేతర వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. తాము చెప్పిన ధరలకే వస్తువులు అమ్మాలని, తక్కువకు విక్రయిస్తే ఊరు విడిచి వెళ్లాలంటూ హుకుం జారీ చేస్తున్నారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎద్దుల కాటన్, కేరళ ఫ్యాన్సీ షోరూములు, గెలాక్సీ చికెన్ సెంటర్ లాంటి కొత్త వ్యాపారాల ఏర్పాటు కొందరికి సహించలేని అంశమై, సిండికేట్‌గా ఏర్పడి బెదిరింపులకు దిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాధితులు పోలీసులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ మున్సిపల్ కమిషనర్ ఈ వ్యవహారాన్ని డీఎస్పీ శ్రీనివాసులకు బదిలీ చేశారు. డీఎస్పీ స్థానిక వ్యాపారులను పిలిచి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. స్థానికేతరుల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవన్నారు. దేశంలో ఎవరు ఎక్కడైనా వ్యాపారం చేయవచ్చని, జీవనం సాగించవచ్చని ఆయన స్పష్టంచేశారు. డోన్ పట్టణంలో పెరుగుతున్న ఈ అణచివేత ధోరణి కొనసాగితే శాంతి భద్రతలకు భంగం కలగవచ్చని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఓ ప్రకటనలో విమర్శించారు. వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బెడద పెరిగిపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నందమూరి నగర్, వైఎస్సార్ నగర్‌లలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక చిన్న పాటి వర్షానికే మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోతున్నాయని చెప్పారు. ఎస్సార్బీసీ కాలనీలో నిర్మించిన 3 వేల టిడ్కో గృహాల్లో 150 కుటుంబాలు మాత్రమే జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

## అధికారులకు ధన్యవాదాలు

నంద్యాల(వ్యవసాయం): వెలుగోడులో గణేష్ శోభాయాత్ర సమయంలో తలెత్తిన సమస్యను పరిష్కరించి శాంతియుతంగా కార్యక్రమం జరిగేలా చూసిన అధికారులకు రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బుగ్గన చంద్ర మౌళీశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పోలీసు శాఖ సమన్వయ లోపంతోనే శోభాయాత్రలో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి తలెత్తిందన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించి డీఐజీ కోయప్రవీణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా కార్యక్రమం సజావుగా సాగేలా చేశారన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీనివాసులు, రాంప్రసాద్, రామాంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సుహాసినిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డు సుద్ద ఫ్యాక్టరీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని పెద్దరాజు పాలెం గ్రామానికి చెందిన బి. రఘునాథ్ (19) పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓమిని కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రఘునాథ్‌ను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## అధైర్య పడకండి.. అండగా ఉంటాం

రుద్రవరం: గుండె పోటుతో మృతి చెందిన లక్ష్మీరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎల్లావత్తులలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి(74) ఈ నెల 12వ తేదీన గుండె పోటుతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే..ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్‌లు గంధం రాఘవరెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డిలతో కలిసి ఆ గ్రామానికి వెళ్లారు. అక్కడ మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పలకరించారు. అనంతరం మృతికి గల కారణాలు తెలుసుకొని ఓదార్చారు. కాగా గంగుల వచ్చిన విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎల్లవత్తులకు చేరుకొని తమ సమస్యలు చెప్పుకున్నారు. యూరియా అందడం లేదని రైతులు, తమ పింఛన్ కోత విధించారని దివ్యాంగులు ఆయన ఎదుట వాపోయారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు.

చాగలమర్రి: మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి కుటుంబాన్ని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఎనిమిది రోజుల క్రితం కుమార్‌రెడ్డి తల్లి భాగ్యమ్మ(85) అనారోగ్యంతో మృతి చెందారు. ఈనేపథ్యంలో ఆదివారం చాగలమర్రిలోని ఆయన ఇంటికి చేరుకుని సానుభూతి తెలిపారు.అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, వ్యాపార వేత్తలు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, షేక్ నాయబ్ రసూల్, ఉపసర్పంచ్ మహమ్మద్ సోహెల్, సర్పంచ్ గోవిందయ్య, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉప్పలపాటి రవి, సుధాకర్ రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శి శేషు రమేష్, మాజీ సర్పంచ్ బాబు, మండల నాయకులు ఉన్నారు.



ఎల్లావత్తులలో మృతుడి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

## కార్మిక హక్కులను హరిస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ రంగ కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అరుణకుమార్, ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి వాడుకున్న నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో అనేక ఆంక్షలు విధించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆటో కార్మికుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం వీధిలో పడేసిందన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మౌలీషా, మౌలాలి, చిన్నమౌలాలి, శీను, జాకీర్, పఠాన్, తదితరులు పాల్గొన్నారు.